

ఆర్టీసీ ఉద్యోగులకు 'పవర్'
- ప్రవర్తనలో మార్పు వచ్చేలా శిక్షణ కార్యక్రమాలు
- రెండు విడతల్లో డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లకు ట్రైనింగ్
- ప్రయాణికులకు చేరువ చేసేందుకు సంస్థ శ్రీకారం

7

ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్

- ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక వాహనం
- స్పాట్‌లోనే ఆహార నాణ్యత నిర్ధారణ
- కల్తీకు చెక్.. ఆరోగ్యానికి భరోసా

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో నాణ్యత లేని ఆహార ముడి పదార్థాలు, ఆహార పదార్థాల్లో ఏదో ఒక రూపంలో కల్తీ జరుగుతున్నది. ఈ విషయం ఇటీవల అధికారులు చేపట్టిన తనిఖీల్లో వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఓ వైపు అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఈ నేపథ్యంలో ఆహార నాణ్యత విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలని సర్కారు నిర్ణయించింది. ఇందులో భాగంగా ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ పేరిట మొబైల్ వ్యాన్లను రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాలకు ప్రభుత్వం కేటాయించింది. మెదక్‌కు కేటాయించిన వాహనం శనివారం సంగారెడ్డి జిల్లా కేంద్రానికి చేరుకున్నది. ఈ వ్యాన్‌లో అక్కడికక్కడే ఆహార నాణ్యత నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. హానికరం, నకిలీ, నాసిరకం ఇలా మూడు రకాల ప్రమాణాలపై పరీక్షలు జరుపుతారు. కల్తీ ఉన్నట్లు గుర్తిస్తే అవగాహన, చైతన్యం కలిగించి ముందస్తుగా హెచ్చరికలు జారీ చేస్తారు. మరో సారి పునరావృతమైతే శాంపిళ్లు సేకరించి నిర్ధారణ కోసం ల్యాబ్‌కు పంపి వచ్చిన ఫలితాల ఆధారంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జరిమానాలు విధిస్తారు.



సంగారెడ్డి జిల్లా కేంద్రానికి చేరుకున్న ఫుడ్ సేఫ్టీ వాహనం

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం సంగారెడ్డి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం

హాజరైన మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎమ్మెల్యే, ఎన్నికల ఇన్‌చార్జి వాకిటి శ్రీహరి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, ఎన్నికల పరిశీలకులు చల్లా నర్సారెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సంగారెడ్డి సమీపంలోని మల్కాపూర్ శ్రీవెంకటేశ్వర ఫంక్షన్‌హాల్‌లో శనివారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎమ్మెల్యే, ఎన్నికల ఇన్‌చార్జి వాకిటి శ్రీహరి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, ఎన్నికల పరిశీలకులు చల్లా నర్సారెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. సంగారెడ్డి నియోజకవర్గంలో ఆయనకు మెజార్టీ వచ్చేలా చూడాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కోరారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ వైప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్లు రాంచందర్‌నాయక్, కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుగౌడ్, నాయకులు తోపాజి అనంతకిషన్, కూన సంతోష్, కిరణ్‌గౌడ్, మహేశ్, నవత్ నాగరాజ్, సోహైల్, కసిని రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల ఇన్‌చార్జి వాకిటి శ్రీహరి, పక్కన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



హాజరైన మంత్రులు దామోదర, కొండా సురేఖ, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, పరిశీలకులు చల్లా నర్సారెడ్డి, అభ్యర్థి నరేందర్‌రెడ్డి



కునుకు పాట్లు

నిద్రలేమి సమస్యతో సతమతం

- జిల్లాలో పెరుగుతున్న ఇన్‌సోమియా బాధితులు
- సరిగ్గా నిద్రలేకుంటే అనారోగ్య సమస్యలు
- జీవన శైలి మార్చుకుంటే ఫలితం

సండే స్పెషల్
Sunday Special

జిల్లాకు చెందిన 35 ఏళ్ల వయస్సున్న యువకుడికి అర్ధరాత్రి దాటినా నిద్ర రావడం లేదు. రోజుల తరబడి ఇదే సమస్య ఉండడంతో వైద్యుడిని సంప్రదించాడు. తలంతా పట్టేయడం, చికాకుతో బాధపడుతున్నట్లు చెప్పారు.

సిద్దిపేటకు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థికి రాత్రిపూట చదవాలి అనిపించటం లేదని, నిద్ర రావటం లేదని తల్లిదండ్రులు వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. చదివింది గుర్తుండటం లేదని, ఉదయాన్నే లేచి చదువుకుందామంటే మెలకువ రావటం లేదని డాక్టర్‌కు చెప్పాడు.

ఈ మధ్య కాలంలో పట్టణంలోని పలు ఆస్పత్రులకు ఇలాంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఎక్కువగా వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. రోజుకు సగటున ఆరు గంటల పాటు సెల్‌ఫోన్ చూడడం, జీవనశైలి, ఆహార నియమాల్లో లోపాలతోనే నిద్రలేమి సమస్యని ఎదుర్కొంటున్నారని వైద్యులు చెబుతున్నారు.

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : తెల్లారి లేస్తే ఉరుకులు, పరుగులు.. ఒత్తిడితో కూడిన జీవితం... సమయంతో పోటీ పడి మరి పనిచేయడం.. మారుతున్న జీవన విధానం కొన్ని సమస్యలను తేస్తుంటే, ఏది పడితే అది తినడంతో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇవన్నింటికి కంటే మరో ప్రమాదం అరచేతిలో అట్టిపెట్టుకునే సెల్‌ఫోన్. ఎక్కువగా గ్యాడ్జెట్ల వాడకంతోనూ నిద్రలేమితో ఇబ్బంది పడేవారి సంఖ్య మిగతా అన్ని అంశాల కంటే ఎక్కువగా ఉందని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి వారిలో దాదాపు 80 శాతం నిద్రలేమిని తీవ్రం చేసే ప్రమాదం ఉంది. ఇక మిగిలిన 20 శాతం మంది ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు నిద్రలేమితో సతమతమవుతుంటారు. అంటే నరాల వ్యాధులు, డయాలసిస్ పీడితులు, ఆర్థో వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిలో నిద్ర పట్టక ఇబ్బంది పడుతుంటారు. షిఫ్ట్ డ్యూటీలు చేసే ఐటీ, ఇతర ఉద్యోగుల్లో నిద్రపోయే సమయం మారుతుండడం ఓ సమస్యగా మారింది. ఒక నెలలోపు ఈ సమస్యతో ఇబ్బంది పడుతుంటే వారిని తాత్కాలిక నిద్రలేమి పరిస్థితిగా పరిగణిస్తారు. ఒకటి నుంచి ఆరు నెలల వరకు ఇదే ఇబ్బంది ఉంటే వారిని తీవ్రమైన నిద్రలేమిగా ట్రీట్ చేస్తారు. సంవత్సరాలుగా నిద్ర సమస్యతో ఉంటే వారిని దీర్ఘకాలిక సమస్య చికిత్స అందించాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. జిల్లాలో ఇన్‌సోమియా(నిద్రలేమి) బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సిద్దిపేటలోని

మిగతా 8వ పేజీలో

ఏ వయసు వారికి ఎంత నిద్ర అవసరమంటే..


వయసు	నిద్ర సమయం
5 ఏళ్లలోపు పిల్లలు	10 నుంచి 12 గంటలు
5 - 10 ఏళ్ల వారు	9 నుంచి 10 గంటలు
25 - 50 ఏళ్ల వారు	8 గంటలు
50పైబడిన వారు	6 గంటలు





సూర్య ప్రతాపం

- శివరాత్రికి ముందే భగభగ
- ఉమ్మడి మెదక్ జిల్లాలో పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు
- నర్సాపూర్‌లో అత్యధికంగా 38.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత
- ఎల్లో అలర్ట్ జారీ



మెదక్ అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి చలి గజగజా వణికిస్తుందని.. శివరాత్రికి శివ.. శివా.. అంటూ వెళ్లిపోతుందని పెద్దలు అంటుంటారు. కానీ శివరాత్రికి ముందే ఎండలు ముదురుతున్నాయి. రాత్రిపూట చలి ఇంకా తగ్గనే లేదు.. పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఉదయం 10 గంటలకే సూర్రుమంటున్నాడు. కరెంట్‌పోతే ఇళ్లలో ఉక్కపోత తప్పడం లేదు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే ఎండాకాలం ఎలా గడుస్తుందో అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో భానుడు భగభగ మండుతున్నాడు. మెదక్ జిల్లాలో శనివారం అత్యధికంగా 38.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు వాతావరణశాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రజలకు కీలక సూచనలు చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఎండ వేడిమి ఎక్కువైందని, ఉక్కపోత మొదలైందని వాతావరణం పూర్తిగా పొడిబారడంతో మధ్యాహ్నం ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నది. మార్చి 1 అనంతరం మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

ఉమ్మడి మెదక్ జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఇలా..

మెదక్ జిల్లా నర్సాపూర్, దామరంచ, వెల్దుర్తిలో 38.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొల్చారంలో 38, పాపన్నపేట 37.8, కౌడిపల్లి 37.7, మెదక్ 37.5, టేక్మాల్ 37.4 డిగ్రీలుగా నమోదైంది. సిద్దిపేట జిల్లాకేంద్రంలో 37.7, చేర్యాల 37.2, అక్కన్నపేట 37.1, సంగారెడ్డి జిల్లా అందోల్ 36.7, కోహీర్ 36.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఆరోగ్యం జాగ్రత్త

పగలు ఎండల తీవ్రత.. రాత్రి చలి ప్రభావంతో వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. సీజన్ మారుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. ఇందుకు తగినట్లే జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతూ ఆస్పత్రులకు వచ్చేవారి సంఖ్య పెరుగుతున్నదని వైద్యశాఖ వర్గాలు తెలిపాయి. మరోవైపు దోమల బెడద కూడా పెరుగుతున్నది. ఈ సమయంలో చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

గ్యాస్ సబ్సిడీ ఏదీ?

- లబ్ధిదారులకు మూడు నెలలుగా అందని రాయితీ
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు



8

తోర్నాల స్తూపం కనుమరుగు!

- జాతీయ రహదారి విస్తరణలో కూల్చివేత
- ఇప్పటికే ఓసారి అడ్డుకున్న గ్రామస్థులు
- స్తూపంతోనే ఊరికి ప్రత్యేక గుర్తింపు



7

స్తంభాన్ని ఢీకొట్టిన ఎక్స్‌కవేటర్

● తృటిలో తప్పిన ప్రమాదం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండలం పెద్ద ముభారక్‌పూర్‌లో శనివారం ఎక్స్‌కవేటర్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో, స్తంభం విరిగి పెను ప్రమాదం తప్పింది. ఎక్స్‌కవేటర్‌తో చెట్లను తొలగించే పనులు చేస్తున్న క్రమంలో స్తంభానికి బకెట్ తగలడంతో స్తంభం విరిగింది. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులకు గురయ్యారు. అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని కోరారు.

ఎమ్మెల్సీ ఓటర్లకు స్లిప్పులు అందజేస్తాం

నర్సాపూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న నిర్వహించనున్న ఎమ్మెల్సీ పట్టభద్రులు, టీచర్ స్థానాలకు ఓటు వేసే ఓటర్లకు సిబ్బంది ఇంటింటికి వెళ్లి స్లిప్పులు అందజేస్తారని తహసీల్దార్ కే.శ్రీనివాస్ తెలిపారు. శనివారం నర్సాపూర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో పట్టభద్రులు స్థానానికి 923 మంది ఓటర్లు ఉండగా.. టీచర్ స్థానానికి 145 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. నర్సాపూర్‌లోని జూనియర్ కాలేజీలో పట్టభద్రులకు, టీచర్ స్థానానికి వేరువేరుగా పోలింగు కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

జిన్నారం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పార్వానగర్‌లో డంపుయార్డుకు వ్యతిరేకంగా 18వ రోజు జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. శనివారం కొత్తపల్లిలో జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను జరిపి డంపుయార్డు ఏర్పాటును రద్దు చేసే వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని జేఏసీ నాయకులు తెలిపారు.

పొగాకు ఉత్పత్తులను నిషేధించాలి

కల్హేర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రాణాంతకంగా మారిన పొగాకు ఉత్పత్తులను తక్షణమే నిషేధించాలని పొగాకు నియంత్రణ విభాగం జిల్లా పర్యవేక్షకుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. జాతీయ పొగాకు నియంత్రణలో భాగంగా మండల కేంద్రమైన కల్హేర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రాజాసింగ్, కళాశాల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యార్థులు పట్టుదలతో చదవాలి'

నంగునూరు/మద్దూరు, ఫిబ్రవరి 22 : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివేతే అనుకున్న లక్ష్యం సాధించవచ్చు అని నంగునూరు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గొట్టిపర్తి రామస్వామి గౌడ్ అన్నారు. శనివారం అక్కేనాపల్లి మోడల్ స్కూల్‌లో పదవతరగతి, ఇంటర్ విద్యార్థులకు , మద్దూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వీడ్కోలు సమావేశం న్విహించారు. అక్కేనాపల్లి మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రామస్వామిగౌడ్ మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



మద్దూరు : సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సిద్ధిపేట అర్బన్ మండలం పొన్నాల సమీపంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. త్రీ టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. కొండపాక మండలం మర్పడగ గ్రామానికి చెందిన ఉడెం మల్లారెడ్డి (55) పని మీద సిద్దిపేటకు వెళ్లి, తిరిగి స్వగ్రామానికి వస్తుండగా, గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన మల్లారెడ్డిని స్థానికులు 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చనిపయాడు. కుమారుడు ఉడెం రవీందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

రామయంపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రోజులాగే కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కిన గీత కార్మికుడు ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి పడి కన్నుమూశాడు. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం ఖానాపూర్‌లో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సాయిగౌడ్(48) రోజులాగే కల్లు గీసేందుకు శనివారం సాయంత్రం తాటిచెట్టు పైకి ఎక్కాడు. కల్లు గీస్తుండగా, కాలు జారి కింద పడటంతో తలకు బలమైన గాయం అయింది. అక్కడున్న వారు హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సాయిగౌడ్‌కు భార్య సావిత్రి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


ప్రదీప్ (ఫైల్)

నిజాంపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): 'నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను. పిల్లలు జాగ్రత్త' అంటూ భార్యకు ఫోన్ చేసి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజాంపేట మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. మండల పరిధిలోని నంది గామ గ్రామానికి చెందిన చెర్ల ప్రదీప్(35) కొంత కాలం క్రితం అనారోగ్యానికి గురి కాగా, చికిత్స నిమిత్తం అప్పులు చేశాడు. అప్పులు తీరే మార్గం కనిపించక జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరి లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. అతని భార్య యేసుమణి తల్లిగారింటికి వెళ్లగా, శుక్రవారం రాత్రి ఫోన్ చేసి 'పిల్లలను జాగ్రత్తగా చూసుకో. అప్పులు తీరే మార్గం లేక నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను' అని చెప్పాడు. ఆమె వచ్చి చూసేలోగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక స్థితి సరిగ్గా లేక..

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మానసిక పరిస్థితి సరిగ్గా లేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం సిద్ధిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలో చోటుచేసుకుంది. త్రీ టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మార్కంటి పోచయ్య (61)కు ఏడాది మానసిక ఆరోగ్యం సరిగ్గా లేదు. ఇటీవల అతని చిన్న కుమారుడు మహేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో కుటుంబ సభ్యులంతా సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్నారు. ఇంట్లో ఎవరూ లేనిది చూసిన పోచయ్య శుక్రవారం రాత్రి ఉరి వేసుకున్నాడు. అతని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిరుత దాడిలో గేదె మృతి

రామాయంపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చిరుత మరోసారి దాడి చేసి ఓ గేదెను చంపి తిన్నది. ఈ ఘటన రామాయంపేట మున్సిపల్ పరిధి కొయ్యగుట్ట శివారులో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. గుల్పర్తి గ్రామానికి చెందిన కాషాల స్వామి శుక్రవారం రాత్రి ఎప్పటిలాగే తన వ్యవసాయ భూముల వద్ద పశువులకు మేత వేసి ఇంటికి వచ్చాడు. శనివారం పొలాని వెళ్లి చూడగా, గేదె చనిపోయి ఉంది. చిరుత చంపిందని భావించి వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇచ్చాడు. వారం క్రితమే ఇదే మండలం లక్ష్మాపూర్‌లోనూ చిరుత ఓ ఆవును చంపేసింది. చిరుత వరుస దాడులకు పాల్పడుతుండటంతో రామాయంపేట ప్రాంత ప్రజలు భయాందోళలకు గురవుతున్నారు.

అక్రమంగా నిల్వ చేసిన ఇసుక సీజ్


ఇసుక డంపు వద్ద పోలీసులు

ధూళిమిట్ట, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి) : అక్రమ ఇసుక డంపులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జాలపల్లి గ్రామానికి చెందిన తుపాకుల శ్రీను, పోతన యాదగిరి మోయతుమ్మెద వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలించి ఓ ఖాళీ స్థలంలో నిల్వ చేశారు. శనివారం రెవెన్యూ, పోలీస్ అధికారులు ఆ ఇసుకను గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై షేక్ మహబూబ్ మాట్లాడుతూ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

పట్టా మార్పిడి చేయాలని మృతదేహంతో ఆందోళన

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టా మార్పిడి చేయాలని బాబాయి మృతదేహంతో కుమారుడి ఇంటి ఎదుట కుటుంబసభ్యులు ఆందోళన నిర్వహించిన సంఘటన జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జగదేవ్‌పూర్‌కు చెందిన కొత్త మల్లారెడ్డికి ఎకరం వ్యవసాయ భూమి ఉన్నది. తన అన్న కుమారుడు అగు నరసింహారెడ్డి పేరుపైన రికార్డుల్లో పట్టా చూయిస్తున్నది. నరసింహారెడ్డికి సంబంధించిన భూమి మల్లారెడ్డి, ఆయన కుమారుల పేరుపైనా చూపిస్తున్నది. ఆ భూమి కాళేశ్వరం ప్రాజెక్టు కాలువ భూసేకరణలో పోయింది. ఆ డబ్బు మల్లారెడ్డి, ఆయన కుమారులైన రంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డికి ప్రభుత్వం చెల్లించింది. డబ్బు తనకు ఇస్తే తన పేరు మీద ఉన్న భూమి మీకు చేస్తానని నరసింహారెడ్డి మొండికేసాడు. నరసింహారెడ్డి పేరుపై ఉన్న పట్టా భూమి కబ్జాలో మాత్రం మల్లారెడ్డి కుమారులు ఉంటూ భూమిని సాగు చేస్తున్నారు. ఇద్దరి మధ్య కొన్నేళ్లుగా ఈ భూపంచాయతీ కొనసాగుతుంది. కాగా శనివారం మల్లారెడ్డి(70) మృతిచెందగా మల్లారెడ్డి కుమారులు మృతదేహాన్ని నరసింహారెడ్డి ఇంటి ఎదుట ఉంచి, భూమిని తమ పేరిట మార్పిడి చేయాలని ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ చంద్రమోహన్ ఘటన స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను సముదాయించారు. చివరికి భూమిని పట్టా మార్పిడి చేస్తానని నరసింహారెడ్డి చెప్పడంతో నిరసన విరమించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యార్థులతో వంటలు.. ఇద్దరి ఉపాధ్యాయుల సస్పెన్షన్

కంగ్టి, ఫిబ్రవరి 22, (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కంగ్టి ట్రైబల్ వెల్ఫేర్ విద్యాలయంలో విద్యార్థులతో వంటలు చేయించిన ఇద్దరి ఉపాధ్యాయులను కలెక్టర్ వల్లూరు క్రాంతి సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులతో వంటలు చేయించారని ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ నారాయణఖేడ్ ఆర్డీవో అశోక్ చక్రవర్తిని విచారించాలని ఆదేశించారు. ఆర్డీవో నివేదిక ఆధారంగా వాస్తవమేనని తేలడంతో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జి.మహేశ్, టీజీటీ ఉపాధ్యాయుడు శివకుమార్‌ను సస్పెండ్ చేశారు.

జోరుగా.. హుషారుగా..

బీవీఆర్ఐటీలో ఈ-వాహనాల హోరు

నర్సాపూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బీవీఆర్ఐటీలో జరుగుతున్న జాతీయ స్థాయి ఈ- బాజా సే ఇండియా పోటీలు శనివారం మూడో రోజు జోరుగా సాగాయి. కార్యక్రమానికి మారుతీ సుజుకీ టెక్నాలజీ ఆఫీసర్ సీవీ రామన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మెకానికల్, ఎలక్ట్రికల్ ఎవాల్యుయేషన్ పద్ధతులను పరిశీలించి విద్యార్థులు పలు సూచనలు చేశారు. విద్యార్థులు రూపొందించిన వాహనాలను పరిశీలించారు. పోటీల్లో భాగంగా మహిళా టీంలకు ప్రత్యేకంగా ఈ-కార్ రేసింగ్ నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులకు మార్గదర్శకంగా వ్యవహరించిన అధ్యాపకుడిని ఎంపిక చేసి, ద్రోణాచార్య అవార్డు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సంగారెడ్డి జిల్లా విద్యార్థుల ప్రతిభను వెలికితీసే కార్యక్రమాలకు వేదికగా మారింది. కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో నిర్వహిస్తున్న ఎలాన్ ఎన్‌విజన్ టెక్నో కల్చరల్ ఫెస్ట్‌లో రెండో రోజు విద్యార్థులు పలు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. నర్సాపూర్ పరిధి బీవీఆర్ఐటీలో జరుగుతున్న జాతీయ స్థాయి పోటీల్లో మహిళా టీంలు ఈ-కార్లను పరుగులు పెట్టించారు.


ట్రాక్‌పై సిద్ధంగా ఉన్న ఈ-బగ్గీ


ఆర్ట్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

కంది ఐఐటీహెచ్‌లో కల్చరల్ ఫెస్ట్

కంది, ఫిబ్రవరి 22: సంగారెడ్డి జిల్లా కంది శివారులోని ఐఐటీ హైదరాబాద్‌లో ఎలాన్ ఎన్‌విజన్ టెక్నో కల్చరల్ ఫెస్ట్ వేడుకలు శనివారం ఉత్సాహంగా కొనసాగాయి. ఐఐటీహెచ్ ఆడిటోరింలో సంగీత కచేరీలో శాస్త్రీయ వాయిద్యాల నడుమ వినసొంపుగా పాటలు పాడి అలరించారు. ఐఐటీహెచ్ లెక్చరల్ హల్‌లో బ్రేక్ ఫ్రీ డ్యాన్ షోలో విదార్థినులు నృత్యాలు చేసి అదరగొట్టాయి. ఆర్కెడ్ గేమ్స్‌లో భాగంగా మట్టితో చేసిన ఆకృతుల పోటీ, పెయింటింగ్ కలర్ బాల్స్ షో, బుల్‌ఫైట్ గేమ్ షో నిర్వహించారు. అలాగే, ఆర్ట్ వర్క్‌షాప్ కాంపిటిషన్‌లో పోటీలు, కలర్‌మిక్స్ పెయింటింగ్ పోటీలకు విద్యార్థులు ఎక్కువగా మక్కువ చూపారు. ఈ సారి పోటీల్లో గెలిచిన వారికి రూ.6 లక్షల విలువైన బహుమతులను అందజేయనున్నట్లు ఐఐటీహెచ్ వర్గాలు తెలిపాయి.


ఐఐటీహెచ్‌లో ఎలాన్ ఎన్‌విజన్ టెక్నో కల్చరల్ ఫెస్ట్ వేడుకల్లో పెయింటింగ్ కలర్‌బాల్స్ షోలో పోటీ పడుతున్న విద్యార్థులు

తోర్నాల స్తూపం కనుమరుగు


గిరాయిపల్లి ఎన్‌కౌంటర్‌లో అమరులైన పీపుల్స్‌వార్ నాయకులు (ఫైల్)



తోర్నాల వద్ద అమరవీరుల స్మారక స్తూపం

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సుమారు మూడు దశాబ్దాల పాటు చెక్కుచెదరకుండా.. అమరుల త్యాగాలను గుర్తు చేస్తూ ఠీవీగా నిలిచిన స్తూపం ఇప్పుడు కనుమరుగు కానుంది. ప్రభుత్వం అన్ని స్తూపాలనూ కూల్చి వేస్తున్న సమయంలోనూ గ్రామస్థులు మూకుమ్మడిగా అడ్డుకుని నిలబెట్టుకున్న ఆ స్మారకం రోడ్డు విస్తరణలో భాగంగా ఉనికిని కోల్పోనుంది. మెదక్- ఎల్కతుర్తి వయా సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మూడు దశాబ్దాల చరిత్ర ఉన్న తోర్నాల స్తూపాన్ని తొలగించాలని నిర్ణయించడంతో గ్రామస్థుల్లో ఆందోళన మొదలైంది. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఆర్ అండ్ బీ అధికారులు ఈ స్తూపాన్ని ఇప్పటికే ఓసారి తొలగించే ప్రయత్నం చేయగా, గ్రామస్థులు అడ్డుకున్నారు.

గిరియిపల్లి మృతుల స్మారకార్థం..

1979లో జరిగిన గిరాయిపల్లి ఎన్‌కౌంటర్‌లో నాటి పీపుల్స్‌వార్ నాయకులు మాదవనేని జనార్దన్‌రావు, కొలిశెట్టి ఆనందరావు, లంకా మురళీమోహన్, వనపర్తి సుధాకర్‌లు అసువులు బాసారు. వారి స్మారకార్థం 1989లో మెదక్-సిద్దిపేట రహదారి పక్కన తోర్నాల వద్ద అప్పటి దళ ఆర్గనైజర్ రామన్న నేతృత్వంలో గ్రామస్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నిర్మించారు. ఆ తర్వాత ప్రభుత్వ నిర్ణయం మేరకు ఉమ్మడి జిల్లాలో నక్సల్స్ నేతల స్మారకంగా నిర్మించిన పలు స్తూపాలను కూల్చి వేశారు. తోర్నాల స్తూపాన్ని పోలీసులు ధ్వసం చేసేందుకు ప్రయత్నించగా, ప్రజలంతా అందుకు అడ్డం పడ్డారు. వారి అభీష్టం మేరకు తోర్నాల స్తూపం అమరుల త్యాగాలకు చిహ్నంగా తోర్నాల రహదారిపై అలా నిలిచిపోయింది.

గ్రామానికి గుర్తింపు..

అమరుల త్యాగాలకు గుర్తుగా ఐక్యంగా, స్వచ్ఛందంగా నిర్మించుకున్న తోర్నాల స్తూపం తమ గ్రామానికి తెలుగు రాష్ట్రాల్లోనే ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిందని గ్రామస్థులు చెబుతున్నారు. నాటి ఉద్యమ స్మృతులు, త్యాగాలకు ప్రతీకగా నిలిచిన స్తూపాన్ని ఇప్పటికే ఓసారి ధ్వసం చేసే ప్రయత్నం చేసి, విరమించుకున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు రోడ్డు విస్తరణలో భాగంగా స్తూపాన్ని కూల్చేందుకు ఒప్పుకోమని ముక్తకంఠంతో చెబుతున్నారు. ఈ విషయాన్ని మాజీ మంత్రి హరీష్ రావు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిసింది. అధికారులు, కాంట్రాక్టర్ స్తూపాన్ని పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో నిర్మిస్తామని హామీ ఇచ్చారని గ్రామస్థుల ద్వారా సమాచారం.

ఈ విషయమై ఎన్‌హెచ్ డీఈని సంప్రదించగా.. 'స్తూపం విషయంలో అధికారికంగా గ్రామస్థులకు ఎలాంటి హామీ ఇవ్వలేదని, కాంట్రాక్టర్ గ్రామస్థులతో మాట్లాడి ఉండవచ్చని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు 'పవర్'

ప్రవర్తనలో మార్పు వచ్చేలా శిక్షణ కార్యక్రమాలు

రెండు విడతల్లో డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లకు ట్రైనింగ్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని ప్రయాణికులకు మరింత చేరువ చేసి మెరుగైన సేవలందించి ఆదాయాన్ని పెంచడమే కాకుండా ఉద్యోగుల ప్రవర్తనలో మార్పు వచ్చేలా పవర్ (పీక్ పర్ఫార్మెన్స్ త్రూ ఓనర్‌షిప్ విత్ ఎంపతీ రిసాల్వ్) శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. తొలి విడత శిక్షణ కార్యక్రమం ఈ నెల 18వ తేదీన ప్రారంభం కాగా 23 వరకు కొనసాగనుంది. మహాశివరాత్రి తర్వాత రెండో విడత నిర్వహించనున్నారు. డిపో మేనేజర్ల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లకు 40-45 మంది చొప్పున శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రహదారి భద్రత, ప్రయాణికుల పట్ల సత్ప్రవర్తన, వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు, ఆరోగ్యం, ఓనర్‌షిప్, దృఢ సంకల్పం, మానసిక, శారీరకంగా శక్తివంతులను చేయడం తదితర అంశాలపై శిక్షణ అందిస్తున్నారు.

సిబ్బందిలో చైతన్యం తీసుకొచ్చేలా

ఆర్టీసీ సంస్థలో ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వర్తించేలా చైతన్యం తీసుకొస్తున్నాం. విధులు నిర్వర్తించే బస్సు నాది, ప్రయాణికులే సంస్థ అనే భావన రావాలనే ఉద్దేశంతో శిక్షణ తరగతుల్లో అవగాహన కల్పిస్తున్నాం. డిపో పరిధిలోని అన్ని విభాగాల సిబ్బందికి రోజూ వీలును బట్టి శిక్షణ ఇస్తున్నాం. శిక్షణతో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఇతర సిబ్బంది ప్రవర్తనలో మార్పు తెచ్చేందుకు ఈ శిక్షణ తరగతులు దోహదపడనున్నాయి.

- ఉపేందర్, సంగారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్



ఆవాస విద్యాలయం.. పేదలకు వరం

70 మంది విద్యార్థులకు 19 ఏళ్లుగా ఉచిత విద్య, వసతి

నేడు ఆవాసం 19వ వార్షికోత్సవం


వ్యవస్థాపకుడు కృష్ణారెడ్డి

రామాయంపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఓ ఉద్యోగి సేవాగుణం.. నిరుపేద విద్యార్థులకు ఆసరాగా నిలుస్తోంది. ఉచిత చదువుతో పాటు ఆశ్రయం కల్పిస్తోంది. మొదట్లో ఎకరం స్థలాన్ని అప్పట్లో దాతల సాయంతో కొనుగోలు చేసి శిశుమందిర్ నెలకొల్పారు. ఇప్పుడు అదే భవనాన్ని అనుకుని మరొకటి నిర్మించి నాలుగు నుంచి పదో తరగతి పిల్లలకు అనుకూలంగా వసతులు కల్పిస్తున్నది రామాయంపేటలోని ఆవాస విద్యాలయం. 19 ఏళ్లగా దాతల విరాళాలతో ఇక్కడ విద్యనందిస్తున్నారు. ఇక్కడ విద్య అభ్యసించిన పలువురు ఇప్పుడు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. అప్పట్లో విద్యుత్ అధికారి కృష్ణారెడ్డి ఉదారత భావంతో ఈ విద్యాలయం స్థాపించబడింది. నేడు 70 మంది పేద కుటుంబాల పిల్లలకు ఉచిత విద్య, వసతి సౌకర్యం అందుతున్నది. ఈ విద్యాలయ 19వ వార్షికోత్సవం ఆదివారం జరగనుంది. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యేలు అంతిరెడ్డి విఠల్‌రెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి, వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు హాజరుకానున్నారు.

పంటలు ఎండుతున్నా పట్టించుకోరా?

విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన



ఝరాసంగం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి వారం రోజులు గడుస్తున్నా పట్టించుకోరా అంటూ మండల పరిధిలోని కుప్పానగర్ రైతులు శనివారం విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడించారు. ఝరాసంగం విద్యుత్ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిలదీశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మొక్కజొన్న, ఆలుగడ్డ పంటలు ఎండిపోతుండగా ప్రైవేటు వెంచర్ యాజమాన్యం కోసం విద్యుత్ సరఫరాను నిలిపివేశారంటు ఆరోపించారు. పంటలు ఎండిపోతున్నాయని పలుమార్లు అధికారులతో మొరపెట్టుకున్నా ఏఈ తమ గోడు వినడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడు చూసిన విధులకు హాజరుకారని, రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని రైతులు హెచ్చరించారు. ఈ అందోళనలో రైతులు మల్లికార్జున్‌పాటిల్, మాణిక్‌రావు, శివన్న, పాండు, లాలన్న, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీరంగూడకు శివరాత్రి శోభ

● ముస్తాబవుతున్న భ్రమరాంభామల్లికార్జున ఆలయం ● ఐదు లక్షల మంది వస్తారని అంచనా ● ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు


ఆలయ ప్రాంగణంలో సిద్ధమవుతున్న కోనేరు

అమీన్‌పూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ శైవక్షేత్రం అయిన బీరంగూడలోని భ్రమరాంభామల్లికార్జున ఆలయం ముస్తాబవుతోంది. పండుగ రోజు స్వామి దర్శనానికి ఐదు లక్షల మంది భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్న పాలకమండలి ఈ మేరకు భారీ ఏర్పాట్లు చేస్తోంది. క్యూలైన్లు, చలువ పందిళ్లు వేస్తున్నారు. నిరంతరం తాగునీటిని సరఫరాకు ఏర్పాట్లు చేశారు. శివరాత్రి మరుసటి రోజు నిర్వహించే భ్రమరాంభామల్లిఖార్జునస్వామి కల్యాణోత్సవం తిలకించేందుకు మరో లక్ష మంది హాజరుకానున్న నేపథ్యంలో అన్నదానం చేసేందుకు నాలుగు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణకు అమీన్‌పూర్ మున్సిపాలిటీ వంద మంది సిబ్బందిని నియమించింది. మరికొంత మంది సిబ్బందిని జీహెచ్ఎంసీ నుంచి పిలిపిస్తున్నారు. శివరాత్రి జాగరణ సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనల కోసం 15బృందాలు తరలివస్తున్నాయి. రాత్రంతా ఆధ్యాత్మిక సంగీత విభావరి నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయి.

భారీ భద్రతా.. పార్కింగ్‌కు ప్రత్యేక రూట్ మ్యాప్

పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నందున గుట్టపై పార్కింగ్ సమస్య తలెత్తకుండా పటాన్‌చెరు సబ్‌డివిజన్ పోలీసులు ప్రత్యేక బందోబస్తుకు ప్రణాళిక సిద్ధం చేశారు. గుట్టపైకి చేరుకునే మూడు ప్రధాన మార్గాలలో ఎక్కడికక్కడ పార్కింగ్ వసతిని ఏర్పాటు చేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా పార్కింగ్ పాయింట్లను సూచిస్తూ రూట్‌మ్యాప్‌లను సిద్ధం చేశారు. పటాన్‌చెరు డీఎస్పీ ఆధ్వర్యంలో 8మంది సీఐలు, 20మంది ఎస్‌ఐలతో పాటు 250మంది కానిస్టేబుళ్లను బద్రత కోసం నియమిస్తున్నారు. సంగారెడ్డి, రామచంద్రాపురం, మియాపూర్, సికింద్రాబాద్, మెహదీపట్నం తదితర ఆర్టీసీ డిపోలనుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు.

అందుబాటులోకి కోనేరు

సుమారు రూ.30లక్షల వ్యయంతో ఆలయ ఈశాన్యం దిక్కులో ప్రత్యేకంగా నిర్మిస్తున్న కోనేరు ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. అమీన్‌పూర్ మాజీ సర్పంచ్, మాజీ ఆలయ కమిటీ చైర్మెన్ ఏనుగు నర్సింహారెడ్డి నేతృత్వంలో కోనేరు నిర్మాణం తుది దశకు చేరుకుంది. ఆలయ కమిటీ సభ్యులు, దాతల సహకారంతో కొనసాగుతున్న కోనేరును శివరాత్రికి అందుబాటులోకి తెచ్చేలా రాత్రీపగలు పనులు నిర్వహిస్తున్నారు. కోనేరు మధ్యలో ఏర్పాటు చేసిన శివుడి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కోనేరు చుట్టూ సుందరీకరణ పనులు, లైటింగ్, టైల్స్‌వేసే పనులు పూర్తి చేస్తామని ఆయల కమిటీ సభ్యులు పేర్కొన్నారు.


జాతరలో ఏర్పాటు చేస్తున్న జెయింట్‌వీల్

భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు : సుధాకర్‌యాదవ్, ఆలయ కమిటీ చైర్మన్

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బీరంగూడలోని భ్రమరాంభామల్లికార్జున ఆలయంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మెన్ సుధాకర్‌యాదవ్, ఆలయ ఈవో శశిధర్‌గుప్తలు పేర్కొన్నారు. పదిహేను రోజులుగా ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది శివరాత్రి ఏర్పాట్లపై తలమునకలై పనిచేస్తున్నామన్నారు. కోనేరు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. ఉత్సవాలను విజయవంతంగా పూర్తి చేసేందుకు రెవెన్యూ, మున్సిపాలిటీ, పోలీసు, హెచ్ఎండబ్ల్యుఎస్, ఆరోగ్యశాఖలతో పాటు అనేక ప్రైవేటు సంస్థలు, దాతలు, ధార్మిక సంఘాలు సహకరిస్తున్నాయన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

ఎస్‌హెచ్‌జీ సభ్యులందరికీ రుణాలు మంజూరు చేయాలి

● జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

సిద్దిపేట కలెక్టరేట్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) సభ్యులందరికీ బ్యాంకు లింకేజీ రుణాలను సకాలంలో అందించాలని అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి సెర్ప్, మెప్మా ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.895.61 కోట్ల రుణాలకుగాను రూ.831.98 కోట్లు అందించినట్లు తెలిపారు. మిగిలిన రూ.63.62 కోట్లను మార్చి 7 లోపు అందజేయాలని ఆదేశించారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను మంజూరు చేయాలన్నారు. డీఆర్‌డీఏ జయదేవ్, జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి హరిబాబు, మెప్మా పీడీ హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువ ఉత్సవ్‌ను విజయవంతం చేయాలి

విపంచి కళానిలయంలో ఈ నెల 25న నిర్వహించే జిల్లా స్థాయి యువ ఉత్సవ్‌ను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉత్సవాల్లో ఆరు భాగాలపై దృష్టి సారించాలన్నారు. పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఉత్సవ్ పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో యువజన ఉత్సవాల కమిటీ సభ్యులు జిల్లా యువజన అధికారి రంజిత్ రెడ్డి, జిల్లా విద్యా శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, డీపీఆర్‌వో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలి

● జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేట కలెక్టరేట్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం ప్రారంభం నుంచి పండగ ముగిసే వరకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఆదేశించారు. ముందస్తు ఏర్పాట్ల పై శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదు పరిసరాల్లో శానిటేషన్ పనులు చేయాలని, ఉదయం, సాయంత్రం ప్రార్థన సమయాల్లో విద్యుత్ కోతలు లేకుండా చూడాలన్నారు. పోలీసులు భద్రతాచర్యలు తీసుకోవాలన్నారు. ముస్లిం కమిటీ పెద్దలు అధికారులు అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, ఏసీపీలు మధు, పురుషోత్తం, సతీష్, డీపీవో దేవకీ దేవీ, డీఎంహెచ్‌వో పల్విన్ కుమార్, ఏవో అబ్దుల్ రహమాన్, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

'పరీక్షలంటే ఆందోళనకు గురికావద్దు'



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిపుణులు

బెజ్జంకి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పరీక్షల సమయంలో విద్యార్థులు ఆందోళనకు గురి కావొద్దని వ్యక్తిత్వ వికాస నిపుణుడు సంపత్ కుమార్, సైకాలజిస్ట్ రమాదేవి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు వారు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒత్తిడిని జయించి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు ఎలా పొందాలో వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైరాన్‌పల్లిని సందర్శించిన ఎస్ఐ



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్సై షేక్ మహబూబ్

ధూళిమిట్ట, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బైరాన్‌పల్లి గ్రామాన్ని శనివారం మద్దూర్ ఎస్సై షేక్ మహబూబ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా గ్రామంలో ప్రజలందరూ కలిసి మెలిసి ఉండాలని సూచించారు. ఎన్నికలు వస్తూ పోతుంటాయనీ, వాటిని అడ్డం పెట్టుకొని గ్రామాల్లో గొడవలు సృష్టించవద్దన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి గ్రామస్థులు సహకరించాలన్నారు. సైబర్ నేరాలపై కుడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంక్ అధికారులమని, గిఫ్ట్ వచ్చిందదంటూ గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీలు అడిగితే చెప్పవద్దన్నారు. గ్రామాల్లో ఏవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోళ్లపై విచారణ జరపాలి

హుస్నాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్‌లో జరిగిన సీసీఐ కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్ అధికారికి వినతిపత్రం సమర్పించారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతులు కాకుండా అక్రమంగా దళారులు పత్తిని అమ్ముకున్నారని తెలిపారు. ఈ అక్రమాలకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ జోక్యం చేసుకొని దీనిపై విచారణ జరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గాల్ రెడ్డి, లక్ష్మణ్, సునిత తదితరులున్నారు.

గ్యాస్ సబ్సిడీ ఏదీ?

● లబ్ధిదారులకు మూడు నెలలుగా అందని రాయితీ ● కార్యాలయాల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు



హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి మహాలక్ష్మి పథకం కింద రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్న చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వ హామీ పూర్తిస్థాయిలో అమలుకావడం లేదు. అర్హులందరికీ వర్తింపజేయకపోవంతో చాలామంది ఈ పథకానికి దూరమయ్యారు. ఎంపిక చేసిన కొందరి లబ్ధిదారులకూ కొన్నినెలలుగా బ్యాంకు ఖాతాల్లో సబ్సిడీ డబ్బులను జమ చేయకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. పథకం ప్రాంభించిన మొదట్లో రూ.332.29 చొప్పున సబ్సిడీ జమ చేసినా. గత మూడు నెలలుగా అందించడం లేదని వాపోతున్నారు. హుస్నాబాద్ మండలంలో 20 వేల గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నాయి. ఇందులో 13 వేలు జనరల్ కనెక్షన్‌లు ఉండగా, దీపం పథకం కింద 4042 మంది ఉన్నారు. ఉజ్వల భారతి పథకం ద్వారా 1000 మంది, సీఎస్ఆర్ కనెక్షన్ లబ్ధిదారులు 2000 మంది ఉన్నారు. సబ్సిడీ డబ్బులు జమకాకపోవడంతో చాలా మంది లబ్ధిదారులు మండల పరిషత్, గ్యాస్ డీలర్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హులందరికీ పథకం వర్తింపజేయడంతో పాటు లబ్ధిదారులకు సబ్సిడీ డబ్బులు అందేలా చూడాలని కోరుతున్నారు.

డబ్బులు ఒక్కసారే పడ్డాయి



రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అధికారంలోకి వచ్చిన తర్వాత మహాలక్ష్మి పథకం ద్వారా రూ. 500కే గ్యాస్ సిలిండర్ ఒక్కసారే వర్తింపజేసింది. మూడు నెలలుగా తమ ఖాతాల్లో రాయితీ డబ్బులు పడడం లేదు. కేవలం కేంద్రం ప్రభుత్వ అందించే రూ. రూ40.71 మాత్రమే జమ వస్తున్నాయి.

-పచ్చిమట్ల శోభ గృహిణి, హుస్నాబాద్

ప్రభుత్వానికి సాగునీరందించే సోయేలేదు

● జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా రైతాంగానికి సాగునీరందించాలన్న సోయి ప్రభుత్వానికి లేకపోవడం తగదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధర్మసాగర్, గండిరామారం రిజర్వాయర్‌కు లిఫ్ట్ చేయాల్సిన మోటార్లను 15రోజులుగా బంద్ చేసినా అధికారపార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడం శోచనీయమని తెలిపారు. . ఈవిషయమై తాను ఈఎన్‌సీ అనిల్‌కు మార్, నీటి పారుదలశాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను పలుదఫాలుగా చర్చించి మోటార్లు ఆన్ చేయించినట్లు పేర్కొన్నారు. గండిరామారం రిజర్వాయర్ నీటి వద్ద స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి డ్రామాలాడుతూ రైతుల మధ్య చిచ్చుపెడుతుండటం సిగ్గుచేటని తెలిపారు. అన్ని ప్రాంతాల రైతులకు సాగునీరందించే విధంగా నీటి పారుదలశాఖాదికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని, అందుకు భిన్నంగా ప్రవర్తిస్తే రైతుల కోపాగ్నికి గురవక తప్పదని పేర్కొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో సీసీ కెమెరాలు

రాయపోల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పలు ఆలయాల్లో దొంగతనాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో రాయపోల్ మండలం రామారం గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో 8 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గౌడ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సీఐ లతీఫ్ ప్రారంభించారు. కార్యక్రమంలో రాయపోల్ ఎస్ఐ రఘుపతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సమగ్రత శిబిరానికి విద్యార్థి ఎంపిక



వైష్ణవి

వర్గల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సమగ్రత శిబిరానికి వర్గల్ మహాత్మా జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థి ఎం వైష్ణవి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి శనివారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒడిశా రాష్ట్రంలోని బారంపూర్ విశ్వవిద్యాలయంలో మార్చి 3 నుంచి 9 వరకు నిర్వహించే జాతీయ శిబిరంలో ఆమె పాల్గొంటారని తెలిపారు. వైష్ణవిని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావు, అధ్యాపకులు అభినందించారు.

ముస్తాబైన రామలింగేశ్వరుడి ఆలయం

మిరుదొడ్డి, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): శివరాత్రిని పురస్కరించుకుని మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలోని రామలింగేశ్వరాలయం ముస్తాబైంది. ఈమేరకు శనివారం మాజీ సర్పంచు శ్రీనివాస్ మాట్లాడుతూ బుధవారం శివరాత్రి పర్వదినం సందర్భంగా రెండు రోజుల ముందునుంచే ఆలయానికి భక్తులు తరలివస్తారన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయానికి రూ.20 లక్షలతో సీసీరోడ్డును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మోటార్ సైకిళ్ల దొంగ అరెస్ట్

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిళ్ల దొంగను సిద్దిపేట టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సిద్దిపేట ఏసీపీ మధు తెలిపిన వివరాల ప్రకారం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టెలిఫోన్ నగర్ కు చెందిన నన్నవల దయానందం కొన్ని రోజుల క్రితం ఏపీ36 ఏన్ 6382 నంబర్ గల తన బైక్‌ను ఎవరో గుర్తుతెలియని వ్యక్తి దొంగిలించకపోయాడని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సీఐ ఉపేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం 11.30 గంటలకు పోలీసులకు అందిన సమాచారం మేరకు రాజీవ్ రహదారి పక్కన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమీపంలో దుబ్బాక మండలం రాజక్క పేట గ్రామానికి చెందిన ఆస సుదర్శన్ ఆ నంబర్ గల బైక్ పై వెళ్తుండగా సీఐ ఉపేందర్, సిబ్బంది కనకరాజు, ప్రశాంత్ కలసి పట్టుకున్నారు. అతడిని విచారించగా పలుచోట్ల మోటర్ సైకిళ్ల దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడు గతంలో సిద్దిపేట వన్ టౌన్, టూ టౌన్ పరిధిలో దొంగతనాలు చేసి జైలుకు వెళ్లి వచ్చాడని ఏసీపీ తెలిపారు. అతడి నుంచి ఐదు మోటర్ సైకిళ్లు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. ఈ కేసు ఛేదనలో కీలకపాత్ర వహించిన సీఐ ఉపేందర్, సిబ్బంది కనకరాజు, ప్రశాంత్ సుధాకర్ రెడ్డి లను ఏసీపీ అభినందించి నగదు రివార్డు అందజేశారు.

దొంగల బీభత్సం

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన షటర్‌ని కట్ చేసి నగదు ఎత్తుకెళ్ళిన సంఘటన గజ్వేల్ పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గజ్వేల్ పట్టణం జాలిగామ రోడ్డులో గల డెలివరీ కంపెనీకి సంబంధించిన ఐదు ఫోన్లు, 90 వేల నగదును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. డెలివరీ గోదాం నిర్వాహకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. అలాగే గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలోని లింగారాజ్‌పేట్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను కట్ చేసి అందులో కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లారు. పట్టణంలో వరుసగా దొంగతనాలకు నిఘా వైఫల్యమే కారణం అని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బెజ్జంకి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాచారం గ్రామ శివారులో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, బెజ్జంకి పోలీసులు కలిసి దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ శివారులో శుక్రవారం రాత్రి పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ బెజ్జంకి పోలీసులు కలిసి దాడులు చేసిన ఆరుగురిని అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పారిపోయారు. అదుపులోకి తీసుకున్నవారి నుంచి నుంచి రూ.6,480, ఐదు మొబైల్ ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శంకర్ రావు తెలిపారు.

ఘనంగా రుద్ర, జలఘటాభిషేకం

చేర్యాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం కడవేరుగు గ్రామంలోని ప్రాచీనమైన భవానీరుద్రేశ్వర దేవాలయంలో వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భవానీ రుద్రేశ్వరుడికి విశేషపూజలు నిర్వహించారు. భక్తిప్రపత్తులతో జలఘటాభిషేకం, రుద్రాభిషేకం జరిపారు. అనంతరం రుద్రేశ్వరుడిని అన్నపూజ నిర్వహించి వత్తులు, పూలమాలతో అలంకరించారు.



గజ్వేల్ పట్టణంలో చికెన్ మేళా

● హాజరైన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన చికెన్ మేళాలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికెన్ విషయంలో అపోహలు వద్దని, చికెన్ ప్రోటీన్ ఫుడ్ అని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా చికెన్ తిన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, జంగం రమేశ్‌గౌడ్, గుంటుకు శ్రీనివాస్, ఊడెం శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్

● ఎన్ఆర్ఐ పెడుతల ప్రతాప్‌రెడ్డి సహకారంతో ఏర్పాటు



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ప్రవాస భారతీయుడు పెడుతల ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ అందుబాటులోకి వచ్చింది. చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు పెడుతల ప్రతాప్‌రెడ్డి రూ.4.62లక్షల వ్యయంతో దీన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ల్యాబ్‌ను ప్రారంభించారు. విద్యార్థులు ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా కళాశాలలో గ్రంథాలయం ఏర్పాటుకు రూ.లక్ష విరాళంగా అందించనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపల్ ప్రణీత హర్షం వ్యక్తం చేస్తూ ఎన్ఆర్ఐ దంపతులను సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు పెడుతల ఎల్లారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా మహంకాళమ్మ వార్షికోత్సవం

● ప్రత్యేక పూజలు చేసిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు



ఎంపీ రఘునందన్‌రావుకు జ్ఞాపిక అందజేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

నంగునూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ మహంకాళీ సహిత మాతమ్మ మొదటి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, ప్రముఖ వ్యాపారి వంగ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏలా లతకృష్ణా, మాజీ సర్పంచ్ మల్యాల నర్సింహులు, ఆలయ కమిటీ అధ్యక్షులు రజినీకర్‌రెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణ్ రెడ్డి, రాజీ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, చేర్యాల రాజు,రాజేందర్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

విరాళాలు సేకరించి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న సామాజిక సేవకులు

చేర్యాల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలకేంద్రానికి చెందిన కాటం శ్రీధర్‌కు ఇటీవల ఫిట్స్ రావడంతో విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టి తీవ్రగాయాలపాలై హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్నాడు. మెదడు సంబంధిత ఆపరేషన్ చేయాల్సి ఉండగా, ఆర్థిక స్థోమత లేక కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. విషయం తెలిసిన పట్టణానికి చెందిన సామాజిక సేవకులు ఐత లక్ష్మణ్, ఐత రాము, తాహెర్, నందు తదితరులు తమవంతు వ్యక్తిగత విరాళాన్ని అందించడంతో పాటు సోషల్‌మీడియాలో శ్రీధర్ దైన్యపరిస్థితి వివరించి విరాళాలు సేకరించిన రూ.53వేల నగదును శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

● ములుగు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ములుగు గ్రామానికి చెందిన ఉప్పరి నర్సింహులు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మాజీ డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి



సిద్దిపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్యజ్యోతి): బీజేపీ అభ్యర్థిగా ఒక బీసీ బిడ్డగా ఈసారి ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే ఖచ్చితంగా టీచర్ల సమస్యల పరిష్కారానికి ముందుంటానని గతంలో గెలిచిన ఎమ్మెల్సీలు ఎవరు కూడా టీచర్ల సమస్యలు పట్టించుకోకుండా ప్రభుత్వానికి తొత్తులుగా మారారని మల్క కొమరయ్య ఆరోపించారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్ల ప్రచారంలో భాగంగా బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య బీజేపీ సిద్దిపేట జిల్లా శాఖ నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా సంఘం బాధ్యులు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లుగా విద్యావ్యవస్థలో ఉన్నానని, గెలిపిస్తే అందుబాటులో ఉంటానని అన్నారు. సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ మాట్లాడారు.

'కునుకు' పాట్లు

(5వ పేజీ తరువాయి)

పలు ఆస్పత్రుల్లో జనరల్ ఫిజిషియన్, న్యూరాలజీ ఆస్పత్రులకు వస్తున్న వారిలో సగటున దాదాపుగా 28 నుంచి 30 శాతం మంది ఇన్‌సోమియా బాధితులు ఉన్నట్లు చెబుతున్నారు.

దుష్ప్రయోజనాలు

నిద్రలేమితో కలిగే దుష్ప్రభావాలు తీవ్రంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇది ఎన్నో రకాల అనారోగ్య సమస్యలకు దారి తీస్తుందని హెచ్చరిస్తున్నారు. గుండెజబ్బు, రక్తపోటు, మధుమేహం వంటివి వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. శరీరంలోని రక్తంలో చక్కెరస్థాయిని పెంచేలా చేస్తుంది. ఇది ఇన్సూలిన్ ఉత్పత్తిని ప్రభావితం చేసి, డయాబెటిస్ ప్రమాదాన్ని పెంచుతుంది. తక్కువ నిద్రపోయే వారికి టైప్-2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. ముఖ్యంగా మెదడు పనితీరుపై ప్రతికూల ప్రభావం పడి, జ్ఞాపకశక్తి తగ్గుతుంది. రోగ నిరోధక శక్తిని హరిస్తుంది. నిద్రలేమికి ఆకలికి మధ్య సంబంధం ఉన్నట్లు పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ఆకలిని పెంచే హార్మోన్లు ఎక్కువగా విడుదలై, దీని కారణంగా మనకు తెలియకుండానే ఎక్కువగా తింటాం. ఇది ఊబకాయానికి కారణమవుతుంది.

ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి

సరైన నిద్ర పోవాలంటే స్లీప్ హైజిన్ వాతావరణం చాలా అవసరమని వైద్యులు చెబుతున్నారు. బెడ్‌రూంలో బాగా వెలుతురు ఉండే లైట్లను ఆఫ్ చేయాలి. పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. సెల్‌ఫోన్‌లు, ట్యాబ్‌లను దూరంగా పెట్టాలి. ప్రతీరోజు ఒకే సమయంలో నిద్రకు ఉపక్రమించాలి. రాత్రిపూట తక్కువ ఆహారాన్ని తీసుకోవాలి. అందులోనూ ద్రవ పదార్థాలాంటివి అయితే మంచిది. డ్రైఫ్రూట్స్, బాదం, వాల్‌నట్స్, కివీ ఫ్రూట్స్, చెర్రి జ్యూస్ వంటి నిద్రకు ఉపక్రమించేలా చేసే మెలోటిన్‌ను ఉత్పత్తి చేసే ఫుడ్ తీసుకోవటం ఉత్తమం. అది కూడా కుదిరితే రాత్రి 8 గంటలలోపే తీసుకోవాలి. రాత్రి సమయంలో కెఫిన్ ఉండే టీ, కాఫీ వంటివి అసలు తీసుకోవద్దు. ముఖ్యంగా చికాకు కలిగించే విషయాలపై చర్చించవద్దు. ఒత్తిడి ఎక్కువవడం, తీవ్ర ఆలోచనలు ఉన్నట్లయితే యోగా సాధన చేయటం, ధ్యానం చేస్తూ గడపటం అవసరం. ఉదయం వాకింగ్, వ్యాయమాం అలవాటు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

నిద్రలేమి సమస్యను నిర్లక్ష్యం చేయొద్దు



నిద్రలేమి సమస్యను నిర్లక్ష్యం చేస్తే ఇతర ఆరోగ్య సమస్యలు వస్తాయి. మెదడుపై ఒత్తిడి ఎక్కువగా ఉంటే కూడా నిద్రలేమి సమస్య వస్తుంది. ఈ సమస్యను మొదట్లోనే గుర్తించి పరిష్కారం దిశగా ప్రయత్నం చేయాలి. ఎందువల్ల ఇబ్బంది వస్తుందో తెలుసుకుని అందుకనుగుణంగా నడుచుకోవాలి. లేదంటే హార్మోన్ ఇన్‌బ్యాలెన్స్, రక్తపోటు, షుగర్ వంటి అనారోగ్య సమస్యలు చుట్టుముట్టే ప్రమాదం ఉంది. గుండెపోటుకు కూడా దారితీసే అవకాశం ఉంది. ఆరోగ్యకమైన ఆహారం, వ్యాయామం, సెల్‌ఫోన్ స్క్రీన్ టైమ్ తగ్గించి, స్లీప్ హైజిన్ వాతావరణం ఏర్పాటు చేసుకుంటే నిద్రలేమిని అధిగమించవచ్చు.

- డాక్టర్ అబ్దుల్ హకీం, న్యూరో ఫిజిషియన్, సిటీ న్యూరో ఆస్పత్రి, సిద్దిపేట

ధ్యానం, ప్రాణయామం అవసరం



ప్రాణాయామం, ధ్యానం చేయడం చాలా అవసరం. దీని ద్వారా మనసు నిశ్చల స్థితికి వస్తుంది. చంద్రభేద ప్రాణయామం, నాడిశోధన ప్రాణయామం, భ్రమరి ప్రాణయామం అనే మూడు రకాల ప్రాణాయామలతో నిద్రలేమి సమస్యను అధిగమించవచ్చు. ఒత్తిడిని దూరం చేయాలంటే ధ్యానం అలవాటు చేసుకోవాలి. అంతేకాకుండా సరైన సమయానికి నిద్రకు ఉపక్రమించాలి. రెగ్యులర్‌గా వ్యాయామం, వాకింగ్ చేయాలి. జంక్ ఫుడ్ కాకుండా ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలి.

- తోట సతీష్, ప్రముఖ యోగా గురువు